# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య

15

ఆరోజు సాయంత్రమే మొదలెట్టాడు వెంకటాచలం వేధింపు. వెంకటాచలానికి భార్యని వేధించడం ప్రవృత్తి. వాడి వృత్తి జీవితభీమా సంస్థలో గుమాస్తా. వాడి జీవితానికి భీమాగాని వాడి భార్య సరోజకి యాతనే. వెంకటాచలం తల్లి ఓ పూర్వ సువాసిని. ఆవిడ దృష్టిలో కోడలు చెయ్యని తప్పులేదు. అన్నిటికీ సణుగుతూ సాధిస్తూనే ఉంటుంది. వెంకటాచలం రాత్రి 8 గంటల లోపు ఇంటికి రాడు. వచ్చీ రాగానే భార్య మీద అరుస్తాడు. రోజూ వాడికి విస్కీ కావాలి. లేకపోతే బ్రతకలేడు. దాని గురించి వాడి జీతం, భార్య డబ్బు, నగలు, మామగారిచ్చిన కట్నం ఏదైనా ఖర్చు చేసేస్తాడు. కాదంటే సరోజకి చెంపదెబ్బలు తప్పవు.

సరోజ పెళ్లైమూడేళ్లయినా ఒక్క రోజు కూడా ఇద్దరూ కలిసి షికారుకెళ్లడం ప్రక్కింట్లో ఉన్న మేమవ్వరం చూడలేదు. మా ఆవిడ కథనం ప్రకారం సరోజ పూలు పెట్టుకున్నా, కొత్తచీర కట్టుకున్నా మొగుడు ఆమె కళ్ల నీరు చూస్తాడని.

ఆరోజు ఆరున్నరకే ఇంటికొచ్చాడు. అప్పుడే తాగాడేమో పెద్ద కంఠంతో సరోజని తిడుతున్నాడు. టిఫెను పెడితే సరోజ అత్త గారు వెనకనించి ''ఆ టిఫెను వాడు తినడు. అందులో ఉప్పెక్కువయింది''అంటోంది. దానికి సరోజ మాట్లాడలేదు. వెంకటాచలం మాత్రం పళ్లు కొరుకుతూ ''దానివి ఉప్పు చేతులమ్మా. ఎన్ని మాట్లు చెప్పినా అంతే. చూడు ఎలా చూస్తోందో! బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడదు'' అంటూ ఛెళ్లుమని కొట్టాడు. దానికి సరోజ కెవ్వుమని అరిచి ఏడుస్తోంది. ''నోర్మూసుకో! లేకపోతే చంపెస్తా!''అంటున్నాడు వెంకటాచలం.

మా ఆవిడ, మా అమ్మాయి ఈ భాగోతం అంతా ఆసక్తిగా వింటున్నారు. నేను మీరు ''మీ పన్లు చూసుకోండి. మన

## ఆర్తరక్షణ

కెందుకొచ్చిన గొడవ'' అని నెమ్మదిగా అన్నాను. మా అమ్మాయి కోపంగా ''ఇవ్వాళ ఈ వెధవ మనక్కూడా నిద్ర ఉండనివ్వడులా ఉంది''అంది.

అప్పుడే వచ్చాడు నాగరాజు. నాగరాజు కొద్దిగా మజ్జిగ త్రాగుతుండగా మళ్లీ అరిచాడు వెంకటాచలం. ''ఉసేయ్! మీ నాన్న కొన్న ముష్టి మూడు కాసుల గొలుసు ఎన్నాళ్లు దాస్తావ్. మొగుడుకన్నా గొలుసే ముఖ్యంలా ఉంది నీకు.'' సరోజ ఏడుపు దిగమింగుతూ

''అది నా దగ్గర లేదు. మీరేం చేసినా సరే.'' అంది ''నీ దగ్గరెందుకు లేదు? ఎవడికిచ్చావ్? చెప్పు'' అంటూ వెంకటాచెలం దూకుడుగా భార్య మీదకి వెళ్తున్నట్టు గ్రహించి అందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం.

నాగరాజు 'విషయమేమిటని' సంజ్ఞ చేశాడు. దానికి నెమ్మదిగా ప్రక్కవాడి విషయం క్లుప్తంగా చెప్పాను.

''చూచాయగా వీడు సరైన వాడు కాదన్న విషయం తెల్సుగాని ఇంత పశువనుకోలేదురా''అన్నాడు నాగరాజు బాధపడుతూ. అవునన్నట్టు తలూపాను. ''ఏరా నాగరాజూ! ఏమిటి సంగతి''అని అడిగాను. దానికి వాడు సమాధానం చెప్పబోతుండగా సరోజ కేకలు వినపడ్డాయి.

''నన్నేం చెయ్యకండి. మీకేం కావలిస్తే అదిస్తాను. ఆ గొలుసు మా అమ్మదగ్గర దాచాను. తెచ్చి మీ మొహం మీద పడేస్తాను'' అంది.

''అదన్నమాట అసలు సంగతి. ఇంత తెలివి నీకెక్కడి నుండి వచ్చిందే?''అంటూ వెంకటాచలం భార్యమీద చెయ్యిచేసుకున్నట్టు ''ఛెళ్లు''మని శబ్దం వచ్చింది.

''నన్ను కొట్టకండి. మీకు దణ్ణం పెడతా''అంటూ బ్రతిమాల్తోంది సరోజ.

నాగరాజు గమ్మున లేచి నిలబడ్డాడు. వాడి ముఖంలో చాలా ఆందోళన, కోపం కనపడ్డాయి.

నేను నెమ్మదిగా ''నాగరాజూ నువ్వు కలుగ చేసుకోకు. ఇది నిత్యం జరిగే తతంగమే. ఆ అమ్మాయి దురదృష్టం. మనమేం చెయ్యగలం'' దానికి వాడు శాంతించలేదు. అప్పుడు నేను వాడితో ''ఉరేయ్ మనం అలా పచారు చేసి వద్దాంరా. ఇక్కడ ఈ గోలతో మనశ్శాంతి లేదు. నేనీగొడవ ఏడాది నుంచీ చూస్తున్నాను గాని ఒక్కసారి కూడా కలుగ చేసుకోలేదు'' అన్నాను గొప్పగా.

నేనూ నాగరాజూ గుమ్మందాటుతోండగా సరోజ వీధి తెలుపు తీసి

''అన్నయ్యగారూ! రక్షించండి, నన్ను చంపేస్తున్నారు''అది పెద్దగా ఏడుస్తూ.

''ముండకానా వీధిన పడి నా పరువు పోగొడతావా?''అంటూ మరీ రెచ్చిపోతున్నాడు వెంకటాచలం. నేను నిశ్చేష్టుణ్ణై చూస్తూ ఉండిపోయాను. వాళ్ల కుటుంబ విషయాల్లో కలుగ చేసుకొనే చొరవ, ధైర్యం నాకు లేవు కూడా.

ఎప్పుడు వెళ్లాడో నాగరాజు మాత్రం



వెంకటాచలం వాటాలో చొరబడి వాణ్ణి జబ్బ పట్టుకొని లాక్కొచ్చాడు. వెంకటాచలం వళ్లు తెలియని కోపంలో ''ఎవడ్రా నువ్వు? ల...కా చంపేస్తా ఏమనుకుంటున్నావో..నా సంగతి నీకు తెలీదు.''అన్నాడు.

నాగరాజు మాత్రం తడబడకుండా ''చూడండి. మీరు ఆవేశపడకండి. నేను మీ సోదరుడి లాంటివాడ్ని. మీరు శాంతిగా ఉండండి. అదే చెప్పాలని మిమ్మల్ని తీసుకొచ్చాను''అన్నాడు.

వెంకటాచలం నాగరాజు నెమ్మదిని అపార్థం చేసుకున్నాడు.

''ఏడిశావ్. మా కుటుంబ విషయాల్లో కలుగ చేసుకొంటావురా?'' అంటూ



చెయ్యెత్తి కొట్టబోయాడు. నాగరాజు ఎత్తిన చెయ్యిని దింపకుండా గట్టిగా పట్టుకున్నాడు. వెంకటాచలం కసిగా సరోజనుద్దేశించి ''వీడెవడే నీ రం...మొగుడా?'' అన్నాడు. ఆ తర్వాత వెంకటాచలం నోటమాట లేకుండా నేలమీద పడిపోయాడు నాగరాజు కొట్టిన దెబ్బకి.

నాగరాజు ఆరడుగుల ఆజానుబాహువు, వాడిది కండలు తిరిగిన శరీరం. వాడికి కోపం రావడం నేనెప్పుడూ చూడ్లేదు.

''నా కొడుకుని చంపకు నాయనా!'' అంటూ వచ్చింది వెంకటాచలం తల్లి.

''మీరు దూరంగా వెళ్లండి'' అంటూ గదమాయించాడు నాగరాజు.

వెంకటాచలాన్ని చూసి ''మీ అబ్బాయి క్షమాపణ చెప్పి, తను చేసింది తప్పని రాసిస్తే గాని వదల్ను'' అన్నాడు.

వెంకటాచలం చేతిని నాగరాజు మెలిపెట్టి గట్టిగా పట్టుకున్నాడు. వాడేదో అనబోతే నాగరాజు వాడి చేతిని గట్టిగా నొక్కి ''నేను నీ భార్యని, కాను. జాగ్రత్త'' అన్నాడు. వెంకటాచలానికి మత్తు పూర్తిగా దిగిపోయింది. వాడికేం చెయ్యాలో తెలియలేదు. వాడి తల్లే అంది ''క్షమాపణ చెప్పరా..వదిలేస్తాడు'' అంది. ఓ నిముషం ఆలోచించి ''క్షమించు..వదిలెయ్ నాచెయ్యి'' అన్నాడు.

నాగరాజు దానికి ''క్షమించండి అను'' అన్నాడు.

''సరే! క్షమించండి'' అని వెంకటాచలం అనగానే నాగరాజు వాడ్ని వదిలేశాడు. దుమ్ము దులుపుకుంటూ వేగంగా తన వాటాలోకి వెళ్లి గభాల్న తలుపు వేసుకున్నాడు వెంకటాచలం.

నాగరాజు ''కాగితం మీద రాసియ్యకపోతే నేనూరుకోను'' అన్నాడు గట్టిగా.

నాకు నోట మాట రాలేదు. మా శ్రీమతి, మా అమ్మాయి మాత్రం చాలా ఆనందించేస్తున్నారు.

వెంకటాచలం తల్లి నాగరాజుని ఉద్దేశించి ''నువ్వెళ్లు నాయనా. జరిగిందేదో జరిగింది. మావాడిది పొరపాటే గాని, నీది కూడా తప్పుంది. మా యింట్లో ప్రవేశించి మావాడ్ని కొట్టావు'' అంది కిటికీలోంచి.

''నేనేం కొట్టలేదమ్మా. మీవాడు నన్ను కొట్టకుండా ఆత్మరక్షణ చేసుకున్నా. చేసిన పని తప్పని కాగితం మీద రాసిస్తే నేను వెళ్తాను.'' అన్నాడు కొంచెం కటువుగా నాగరాజు. వాడితో ఏదో చెప్పాలనిపించినా మాట్లాడలేకపోయాను వెంటనే. ''పాకం ముదర నివ్వకురా నాగరాజూ!'' అని వాడి చెవిలో చెప్పాను.

ఇంతలో వెంకటాచలం ఓ కాగితం మీద ఏదో రాసి కిటికీలోంచి విసిరాడు. అది చూశాక నాగరాజు బాగా తగ్గిపోయాడు. ఓ రెండు గ్లాసులు మంచి నీళ్లు త్రాగి నా వంక తిరిగి ''నా మనసు బాగా పాడైపోయిందిరా. నీతో రేపు మాట్లాడతా'' అంటూ పెద్ద పెద్ద అంగలేసుకొంటూ చీకట్లో నడిచి వెళ్లాడు నాగరాజు.

''నాగరాజు మామయ్య వాడ్ని భలే తన్నాడులే. బాగా అయింది శాస్తి'' అంది మా అమ్మాయి స్వరం తగ్గించి.

''ఆడవాళ్లు నిస్సహాయంగా బాధపడుతుంటే నాగరాజు చూస్తో ఊరుకోలేడు. ఇలా జరగటం రెండోసారి. కాని వాడి మనస్సు బాగా నొచ్చుకుంది ఈ గొడవకి'' అన్నాను.

''ఇంతకుముందెప్పుడైనా నాగరాజు మామయ్య ఎవడ్నైనా ఇలాగే తన్నాడా?'' అడిగింది మా అమ్మాయి.

''అది వేరే కథ. ఇప్పుడెందుకులే. వాడికింత కోపం రావడం మాత్రం నేను చూళ్లేదు.'' అన్నాను.

★